నడిచే దారేది?

- ఆక్రమణల్లో ఫుట్‌పాత్‌లు
- నడిచే దారి లేక ప్రజల గగ్గోలు
- ప్రమాదాల బారిన పడుతున్న పాదచారులు
- పట్టించుకోని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



ఫుట్‌పాత్, రహదారిని పూర్తిగా ఆక్రమించుకున్న పందుపుల్లల సందు వస్త్ర వ్యాపారులు



పూర్ణామార్కెట్ ఎదురుగా ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్

ప్రముఖ వాణిజ్య కేంద్రంగా పేరున్న జగదాంబ నుండి పాతపోస్ట్ఫీసు వరకు చాలా భాగం ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఉపయోగపడదంలేదు. చిన్నచిన్న వ్యాపారులతో పాటు పెద్దపెద్ద షాపుల వాళ్లు కూడా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో రోడ్డుపై వాహనాలకు అడ్డం లేకుండా ఫుట్‌పాత్‌లపై నడవాల్సిన ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో రోడ్లపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.



దుర్గాలమ్మ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్‌తో పాటు బస్టాప్‌ను ఆక్రమించుకున్న వ్యాపారులు

జగదాంబ: నియోజవర్గంలో జగదాంబ నుంచి వన్ టౌన్ వరకు, డాల్ఫిన్ హోటల్ నుంచి జనతా బజార్ వరకు రూ.కోట్లు వెచ్చించి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. అంతే కాకుండా సుందరీకరణ పేరుతో ఫుట్‌పాత్‌లను అందంగా తీర్చిదిద్దారు. పాదచారులకు ఉపయోగపడాల్సిన అటువంటి ఫుట్‌పాత్‌లను పలువురు వ్యాపార కేంద్రాలుగా మార్చుకుని దర్జాగా సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో పాదచారులు రహదారిపై నడిచి వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. వాణిజ్య కేంద్రాలైన జగదాంబ, పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాల్లో అసలు ఫుట్‌పాత్‌లు కనబడడంలేదని పాదచారులు గగ్గోలు పెడుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు.. రహదారిపై పార్కింగ్..

వ్యాపారులు ఫుట్‌పాత్‌లు, ఖాళీగా ఉండే స్థలాల్లో దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు చేసుకోవడంతో వినియోగదారులు తమ వాహనాలను రహదారిపై పార్కింగ్ చేసుకోవాల్సి వస్తోంది. ఇలా రహదారిపై ఇష్టానురీతి పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా టర్నర్ చౌల్ట్రీ నుంచి వన్‌టౌన్ వెళ్లే రహదారిలో ఏవీఎన్ కళాశాల డౌన్ వరకు, జనతాబజార్ వద్ద ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గతంలో పదుల సంఖ్యలో ఉండే దుకాణాలు ఇప్పుడు వందల సంఖ్యకు చేరడంతో వన్‌టౌన్ ప్రాంతం రద్దీగా మారిపోయింది. పూర్ణామార్కెట్ వద్ద ఈ దుస్థితి మరింత తీవ్రంగా ఉంది. కమిర్షియల్ ట్యాక్స్ అధికారులకు, జీవీఎంసీకి ఎటువంటి ట్యాక్స్‌లు చెల్లించకుండా వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు.



ఫుట్‌పాత్ దాటి ప్రధాన రహదారిని ఆక్రమించుకున్న జనతా బజార్ వ్యాపారులు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై దృష్టి సారించాలి..

ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజాశేయస్సును పూర్తిగా విస్మరించారని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆక్రమణదారులు నచ్చినట్లు తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. వినియోగదారులు, మార్కెట్‌కు వచ్చే నగరవాసులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, రహదారులపై అనధికార పార్కింగ్‌లు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

సరకుల కొనుగోలుకు వెళ్లలేకపోతున్నాం..



పూర్ణామార్కెట్‌కు వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. నడిచి వెళ్లాలంటే ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, రోడ్డుపై నడుద్దామంటే ట్రాఫిక్ భయం. సరకుల కోసం పూర్ణామార్కెట్‌కు వెళ్లాలంటే సాహసం చేసినట్లు ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకుని ఫుల్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగిస్తేనే ప్రజలకు నడిచే దారి కనబడుతుంది.

– జగదీష్, వినియోగదారుడు

క్లుప్తంగా

కారుణ్య నియామకాలు చేపట్టాలి

- ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి

మహారాణిపేట: విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్‌ను అరకు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ జి.తనూజారాణి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని ఇది వరకు మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబీకులకు అర్హత మేరకు ప్రభుత్వ ఉద్యోగాలు (కారుణ్య నియామకం) కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో కారుణ్య నియామకాలు చేపడతామని తెలిపారు. అరకు ఎంపీతో పాటు వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తడబారికి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

జామియా మసీదు నిర్మాణానికి శంకుస్థాపన



జామియా మసీదు శంకుస్థాపనలో పాల్గొన్న ముస్లిం పెద్దలు

అల్లిపురం: చెంగలరావుపేటలో గల జామియా మసీదు పునర్నిర్మాణానికి శుక్రవారం శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో షాజాదా ఈ హుజూర్ గౌస్ ఉల్ అజామ్ హజరత్ మౌలానా పీర్ సయ్యద్ మహబూబ్ హుస్సేని, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని శంకుస్థాపన చేశారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ



కేజీహెచ్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

మహారాణిపేట: దుంబ్రిగూడ మండలంలోని గుంటగన్నెల పంచాయతీ పిత్తగూడ గ్రామంలో కాఫీ తోటలో ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వారు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనలో కిల్లో లక్ష్మి, కిల్లో కేశవరావు, వి.సీత గాయపడగా కలెక్టర్ ఆదేశాల మేరకు అటవీ అధికారులు వీరిని కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం వీరిని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి దయాల్‌బాగ్ ఉత్పత్తుల ప్రదర్శన

ఆరిలోవ: దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 19 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఐ ఎపెక్ హెడ్ వి.ప్రేమ్ స్వరూప్ తెలిపారు. విశాలాక్షినగర్ డీఐసీ కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఈఐ (దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్) సౌత్‌జోన్ ఆధ్వర్యంలో ఉషోదయ కూడలి వద్ద గల ఉషోదయ ఫంక్షన్ హాలులో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. డీఈఐలో చేతి వృత్తుల్లో శిక్షణ పొందిన 52 మంది తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. బ్లాక్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, దివాన్ సెట్లు, పిల్లో కవర్లు, జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన బ్యాగులు, కుర్తాలు, పిల్లల దుస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సఫాయి కర్మచారీ వ్యవస్థపై కలెక్టర్ సమీక్ష



సఫాయి కర్మచారీ వ్యవస్థపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కమ్యూనిటీ టాయిలెట్ల నిర్వహణపై దృష్టి సారించాలని, పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. నగర పరిధిలోని కమ్యూనిటీ టాయిలెట్ల తాజా పరిస్థితిని గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సఫాయి కర్మచారీ వ్యవస్థపై సమీక్షించే నిమిత్తం వివిధ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్మికుల అవసరాలు, సమస్యలు, జీవనోపాధి తదితర అంశాలపై చర్చించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఐడీ కార్డులు ఇవ్వాలని, బీమా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్లు, ప్రైవేటు ఆస్పత్రులు, కల్యాణ మండపాల్లో పని చేసే కార్మికులకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పునరావాస చర్యలు, జీవనోపాధి ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాలని, స్వయం ఉపాధి పొందేందుకు అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయటం సరి కాదని దీనిపై ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించి మార్పు తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, ఆర్డీవో పి. శ్రీలేఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు లబ్ధిదారులకు సహకరించాలి

- పెండింగ్ రుణాలు త్వరితగతిన అందించండి
- జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి



సమావేశంలో పాల్గొన్న బ్యాంకర్లు, అధికారులు

అల్లిపురం: జీవీఎంసీ పరిధిలో గల పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణాలను త్వరితగతిన అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి బ్యాంకర్లను కోరారు. జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు సీడీపీడీ సత్యవేణితో కలిసి ఆయన ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో శుక్రవారం బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ, ఏపీ టిడ్కో హౌసింగ్ లోన్స్, వన్ సెంట్ ఎస్‌హెచ్‌జీ లోన్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం తదితర పథకాలకు సంబంధించి అన్ని లోన్ అప్లికేషన్లు వెంటనే మంజూరు చేసి లబ్ధిదారులకు లబ్ధి చేకూరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ తెలిపారన్నారు. అదే విధంగా బ్యాంకర్లు లోన్ రికవరీ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు అందించే లోన్ల విషయంలో ఎటువంటి ఆలస్యం చేయరాదని బ్యాంకర్లను కోరారు. యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి మాట్లాడుతూ బ్యాంకు అధికారులు, యూసీడీ అధికారులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని, తద్వారా లబ్ధిదారులకు లబ్ధి జరుగుతుందని తెలిపారు. ప్రత్యేకంగా ఏపీ టిడ్కో పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధికి సంబంధించిన పథకాలకు అర్హులైన లబ్ధిదారులందరికి పథకాలు వర్తించేలా, ప్రతిఫలం అందేలా బ్యాంకు అధికారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు అధికారులు డి. లక్ష్మి, బి. రమణమ్మ, డీపీవో కనకమహాలక్ష్మి, ఏపీడీలు, టీపీఆర్‌వోలు, జీవీఎంసీ పరిధిలోని అన్ని బ్యాంకుల ప్రతినిధులు, సీనియర్ అధికారులు, యూసీడీ అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, మురళీకృష్ణ

పీఎం పాలెం: సంపూర్ణ ఆరోగ్యానికి మించిన భాగ్యం లేదని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అన్నారు. బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణతో కలసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో పోలీస్ సిబ్బందికి బీపీ, సుగర్, న్యూరో, కార్డియాలజీకి సంబంధించిన వైద్యపరీక్షలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మాట్లాడుతూ ఇటువంటి వైద్యశిబిరాలను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. అనంతరం సూపరింటెండెంట్‌ను బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, స్థానిక యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఎంఎస్‌పీ కిరణ్ మణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా కల్పిద్దాం

- సీపీ శంఖబ్రత బాగ్చి పిలుపు
- కోల్ ఇండియా సహకారంతో మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు కుట్టు మిషన్ల పంపిణీ



ట్రాన్స్‌జెండర్లతో నగర పోలీస్ కమిషనర్ బాగ్చి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం: ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించడంలో దేశంలోనే విశాఖ ఆదర్శనీయంగా నిలిచేలా కృషి చేద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. కోల్ ఇండియా సీఎస్సార్ నిధులు రూ.2.50 కోట్లతో ఆధునిక కుట్టు మిషన్లను మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అందించడం అభినందనీయమన్నారు. పిఠాపురంకాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ పాల్గొని.. 75 మందికి ఆధునిక కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్లను ప్రతి మహిళా, ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకుని.. ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళలు కుట్టిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. విశాఖలో ట్రాన్స్‌జెండర్లకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర మార్గాల్లో పయనిస్తున్నారని.. దీని ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నగరంలోని ట్రాన్స్‌జెండర్లను గుర్తించి.. వారందరూ ఒకే మార్గంలో నడిచేలా ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్లు కుట్టు శిక్షణ తీసుకోవడం అభినందనీయమని.. వీరిని మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుట్టు, క్లౌడ్ కిచెన్ రంగంలో శిక్షణ ఇవ్వడానికి తన వంతు కృషి చేస్తానని సీపీ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళలు వేధింపులకు గురైతే.. తన ఫోన్ నంబర్ 79950 95799కు ఫోన్ చేసి విషయం తెలియజేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. నగరంలో ఉపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగినిలు ధైర్యంగా విధులు నిర్వర్తించాలని భరోసా కల్పించారు.

సమస్యల పరిష్కారానికి చలో ఆర్‌ఎం కార్యాలయం



పాల్గొన్న ఎస్‌ఎంయూ నాయకులు

మహారాణిపేట: పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎంయూ ఆధ్వర్యంలో శుక్రవారం చలో ఆర్‌ఎం ఆఫీసు కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ హాజరై ప్రసంగించారు. అనంతరం ఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. రాఫీల్, పి.సుధాకర్, రామకృష్ణ, నీలకంఠం, మూర్తి, శివాజీ, శంకరరావు, వసంతరావు, సురేష్ నాయుడు, డివిజన్ చైర్మన్ రమణ, మాజీ రాష్ట్ర కార్యదర్శులు కె.చిట్టిబాబు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ

సీతంపేట: అక్కయ్యపాలెంలో గల శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. డాక్టర్ వి.గౌరీమోహన్ శిష్యురాలు గన్నవరపు రిషిత లక్ష్మి తన మధురమైన గానంతో భక్తులకు వీనుల విందు చేశారు. త్యాగరాజ, ముత్తుస్వామి, దీక్షితార్ కృతులను ఆలపించారు. ఈమెకు వయొలిన్‌పై మంగళగిరి మోహిత్ శ్రీవ్యాస్, మృదంగంపై జతిన్ జనార్దన, తాలాడ చైతన్య వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కళాకారులను ఘనంగా సత్కరించారు.

జాగ్రత్తలతోనే డెంగ్యూ వ్యాధి కట్టడి



మిరపకాయలవీధిలో రక్త నమూనాలు సేకరిస్తున్న మలేరియా సిబ్బంది



నీళ్ల డ్రమ్ములో లార్వాలను గుర్తిస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం: జగ్రత్తలతోనే డెంగ్యూ, మలేరియా వ్యాధుల కట్టడి సాధ్యమని మలేరియా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మిరపకాయల వీధిలో ఇంటింట అవగాహన కల్పించారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. దోమ లార్వాలు అభివృద్ధి చెందే ప్రాంతాలైన మొక్కల గోలాల్లో నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని, గదిలోకి గాలి, వెలుతురు వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, కిటికీలు, ద్వారాలకు దోమ తెరలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటి ఆవరణలో వాడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనుమానం ఉన్నవారి నుంచి రక్త నమూనాలు సేకరించారు.

నాడు కళకళ.. నేడు వెలవెల..





గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్కుల అభివృద్ధి జరిగితే.. నేడు ఆ పార్కులు కళావిహీనంగా మారాయి. ఒక వైపు సుందరీకరణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పార్కులను అభివృద్ధి చేసి వ్యాయామాలకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేస్తే.. ఇపుడు అవి మూలకు చేరాయి. అందుకు నిదర్శనమే లక్ష్మీ టాకీస్ పార్కు. గోతులు పడి. వర్షం నీరు చేరి, వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురై అధ్వానంగా మారింది.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

